# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణపనులు ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**
2. **రాష్ట్ర ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ప్రధమ సంవత్సరంలో 77శాతం, ద్వితీయ సంవత్సరంలో 81 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత.**
3. **పారిశుధ్యం, పరిసరాల శుభ్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పిస్తోందన్న గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర.**
4. **మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్న విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్.**
5. **జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి.**

==========================

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణపనులు ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సుజల స్రవంతి, పోలవరం-నలమల్ల సాగర్ లింక్, చింతలపూడి ఎత్తిపోతల, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో ముఖ్యమంత్రి గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. అలాగే భూగర్భజలాల పెంపు, జలధార, జల హారతి కార్యక్రమాల గురించి సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టులోని ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ ఏడాది ఆగస్ట్ నాటికి పోలవరం నిర్వాసిత కుటుంబాలను తరలించాలన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ పనులను జూన్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

-------------------------

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఫలితాలను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు

స్థాయి ఉత్తీర్ణత నమోదు అయ్యిందని మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 81 శాతం ఉత్తీర్ణతతో అత్యుత్తమ ఫలితాలను సాధించారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత రెండో సంవత్సరం 68 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు. పునః మూల్యాంకనం పునఃపరిశీలనకు ఈ నెల 20 నుంచి 27 వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మే 21 నుంచి జూన్ 4 వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నామని మంత్రి వెల్లడించారు.

--------------------------

స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర ద్వారా పారిశుధ్యం, పరిసరాల శుభ్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పిస్తోందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని రామ నాయుడుపేటలో "స్వచ్ఛ కృష్ణ – స్వచ్ఛ సర్వేక్షన్" అవగాహన కార్యక్రమాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించామని తెలిపారు. 8 కోట్ల రూపాయలతో 13 ఎకరాల స్థలంలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

--------------------------

మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రాష్ట్ర మహిళా మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఈరోజు ఢిల్లీకి వెళ్లనున్నారు. మంత్రులు వి.అనిత, ఎస్.సవిత, గుమ్మిడి సంధ్యారాణి పార్లమెంటు ఉభయసభల్లో చర్చను తిలకించనున్నారు. బిల్లు ఆమోదం తర్వాత ఈనెల 18న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, ఇతర కేంద్ర మంత్రులను కలిసి ధన్యవాదాలు తెలపనున్నారు. మహిళా బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా బిల్లుతో రాజకీయాల్లో మహిళల పాత్ర పెరిగి, సాధికారతకు బలమైన పునాది లభిస్తుందని పేర్కొన్నారు.

--------------------------

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడమనేది చారిత్రక నిర్ణయమని ఈ బిల్లు ద్వారా చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కూడా పెద్ద సంఖ్యలో మహిళలు చట్టసభల్లోకి వచ్చే అవకాశం ఉందని శివనాథ్ వివరించారు.

--------------------------

ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ – పీఎం ఉష కింద తిరుపతి జిల్లాలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నారు. జిల్లాలోని శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఐదు కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఈ పథకం కింద విడుదలైన నిధులతో కళాశాలలోని విద్యార్థినులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా వృత్తివిద్యలను నేర్పిస్తూ, విద్యతోపాటు స్వయం ఉపాధితో జీవనం సాగించుకొనే విధంగా శిక్షణలు ఇస్తున్నామని కళాశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్

ఆకాశవాణి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల సంబంధిత కేసులపై ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. WhatsApp, Facebook, X, Instagram వంటి మాధ్యమాల వేదికగా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవమానకర వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారం, సామాజిక ఉద్రిక్తతలు రేకెత్తించే పోస్టులు పెరుగుతున్నాయని ఇవి ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే నేరాలుగా గుర్తించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా “జీరో టాలరెన్స్” విధానంతో ఇప్పటివరకు 1549 కేసులు నమోదు చేసి, 1344 మందికి పైగా అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

---------------------------

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మత్స్యకారుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జువ్వలదిన్నె హార్బర్ ను తమ ప్రభుత్వం హయాంలోనే ప్రారంభించి, పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చామని జగన్మోహన్‌రెడ్డి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

పోషణ్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు దేశవ్యాప్తంగా పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలలో 6 ఏళ్లలోపు పిల్లల మెదడు వికాసం, గర్భిణీలు, బాలింతల పోషణపై అవగాహన కల్పించడం, పౌష్టికాహార లోపాన్ని నివారించడం, సంప్రదాయ చిరు ధాన్యాల ఆహారాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఏడాది వయస్సు దాటిన చిన్నారులకు ఎటువంటి పౌష్టికాహారం అందించాలి, టీకాలు, ఇతర ఆరోగ్య సంరక్షణ చర్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

======================